క్లుప్తంగా

శ్రీకాంత్ బృందానికి సత్కారం



నాట్య బృందాన్ని సత్కరిస్తున్న సీఈఓ

శ్రీకాకుళం కల్చరల్: జపాన్‌లో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పో - 2025 వేడుకల్లో డాక్టర్ రఘు పాత్రుని శ్రీకాంత్ శిష్యబృందం రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించినందున ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సాయి కాంత్ వర్మ గురువారం మంగళగిరిలో ఉన్న ఏపీఈడీబీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. జపాన్‌లో మన దేశం తరఫున కూచిపూడి, జానపదం, ఫ్యూజన్ వంటి అద్భుత నృత్య ప్రదర్శనలు చేసి ఆహూతులను అలరించారని సీఈవో కొనియాడారు. బృందంలో రామకౌండిన్య, నేహా, వర్షిత, నేహా థామస్, లలిత, చాందిని పాల్గొన్నారు.

వ్యవసాయ రుణమేళాకు స్పందన



స్వయం సంఘాల మహిళలకు చెక్ అందజేస్తున్న రీజనల్ హెడ్ రాజా

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారులకు సేవలందించడంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడూ ముందంజలో ఉంటుందని బ్యాంక్ రీజనల్ హెడ్ పైడి రాజా అన్నారు. శ్రీకాకుళంలోని రామకృష్ణ థియేటర్ సందులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌సీబీ బ్రాంచ్‌లో వ్యవసాయ రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రుణాలు మాత్రమే కాక ట్రాక్టర్లకు, మోటార్ సైకిళ్లకు, వారి పిల్లల చదువుకు విద్యారుణాలు అతితక్కువ వడ్డీతో మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీసీ బ్రాంచ్ హెడ్ రామచంద్ర బెహరా, ఉమెన్స్ బ్రాంచ్ హెడ్ శ్రీనివాసరావు, కళింగ రోడ్డు బ్రాంచ్ హెడ్ భాస్కరరావు, బలగ బ్రాంచ్ హెడ్ శ్రీనివాసరావు, ఆర్‌డీ ఓ.గౌతమి, రుణ అధికారి గోవర్ధన్, యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, రీజనల్ ఆఫీసు సిబ్బంది జయరాం, వైకుంఠరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



నిషాల్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందిస్తున్న శంకరశర్మ

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలోని అనివెట్టి మండపంలో కేరళ రాష్ట్రం తిరువనంతపురానికి చెందిన ఓంకార్ అకాడమీ గురువు చిత్రా త్యాగరాజన్ శిష్యులు మండా వెంకట నిషాల్ శుక్రవారం భరతనాట్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పైడి మహేశ్వరరావుకు 148వ ర్యాంకు



డాక్టర్ పైడి మహేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ లాసెట్-2025 ఫలితాల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన వైద్యులు డాక్టర్ పైడి మహేశ్వరరావు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 148వ ర్యాంకు సాధించారు. న్యాయశాస్త్రంపై మక్కువతో మూడేళ్ల ఎల్ఎల్‌బీ యూజీ కోర్సులో ప్రవేశం కోసం తాజాగా నిర్వహించిన లాసెట్ పరీక్ష రాశారు. 120 మార్కులకుగాను 103 మార్కులు సాధించి ఔరా అనిపించారు. 40వేల మంది రాసిన ఈ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 148వ ర్యాంకు సాధించడం విశేషం. ఈయన ప్రస్తుతం రాగోలు జెమ్స్ మెడికల్ కాలేజ్‌లో ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీగా పనిచేస్తున్నారు. ఈయన్ను పలువురు వైద్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

అధికారులకు కునుకు కరువాయె..

జి.సిగడాం: విశాఖలో యోగాంధ్రకు ప్రజలను తరలించడానికి మూడు రోజులుగా అధికారులు నానాపాట్లు పడుతున్నారు. జి.సిగడాం మండలంలో 21 సచివాలయాలకు గాను 15 బస్సులను కేటాయించారు. బస్సులు చాలక పోవడంతో ఇబ్బందులు తప్పలేదు. కూటమి నాయకులు అధికారులకు ఫోన్ చేసి తమ బస్సు ఎక్కడ అంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చారు. వీరికి సమాధానం చెప్పలేక అధికారులు సతమతమయ్యారు. శుక్రవారం రాత్రి మండల పరిషత్ ప్రత్యేకాధికారి పి.చంద్రజీవన్, తహసీల్దార్ మహాదేవు సరిత, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఉపయోగాలెన్నో..!



యోగా చేస్తున్న అభ్యాసకులు

- యోగాపై పెరుగుతున్న ఆసక్తి
- ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు సులువైన మార్గం
- యోగా కేంద్రాలకు ఆదరణ

జి.సిగడాం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ మానసిక ఆందోళన, ఒత్తిడితో నిత్యం సతమతమవుతున్నారు. ఇక రోగాల సంగతి సరేసరి. ఈ సమస్యను అధిగమించేందుకు యోగా చక్కటి మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ సాధనకు మించిన ఔషధం లేదని చెబుతున్నారు.

విస్తృత ప్రచారం..

ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని నెల రోజులుగా మండల స్థాయిలో అధికారులతో ప్రత్యేక సదస్సులు, ర్యాలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం యోగా చేయిస్తున్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా యోగా చేయాలని, అప్పుడే రోగాల నుంచి బయట పడతామని అధికారులు, యోగా గురువులు వివరిస్తున్నారు. జి.సిగడాం మండలంలో రామకృష్ణ యోగా చైతన్యధార్మిక సంస్థ గురువులు మీసాల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రతి రోజు యోగా నిర్వహిస్తున్నారు. పద్మాసనం, పశ్చిమోత్తాసనం, చక్రాసనం, ధనురాసనం, భుజంగాసనం, వృక్షాసనం, అర్ధ చంద్రాకారఆసనం, హలాసనం, మకరాసనం, శవాసనం, వజ్రాసనం, సేతు బంధనాసనం తదితర యోగాసనాలపై అభ్యాసం చేయిస్తున్నారు. ధ్యానం, ప్రాణాయామం లాంటి ప్రక్రియలు ఏకాగ్రతను పెంచుతాయి. హృద్రోగం, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించడానికి తోడ్పడుతుంది.

యోగాతో ఆరోగ్యం



ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా యోగా చేయాలి. అప్పుడే రోగాల నుంచి బయటపడతారు. ఆసనాలు క్రమం తప్పకుండా వేస్తే కొన్ని రోగాలకు మందులు కూడా అవసరం లేదు.

– మీసాల రామకృష్ణ, రామకృష్ణ యోగా చైతన్యధార్మిక సంస్థ గురువు

ఒత్తిడి తగ్గుతుంది..



జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల, గ్రామస్థాయిలో ప్రజలకు యోగాపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. సదస్సులు, ర్యాలీ చేయిస్తున్నాం. దీనివల్ల ఆరోగ్యంతోపాటు ఉద్యోగంలో ఒత్తిడి తగ్గుతుంది.

– మహాదేవు సరిత, తహసీల్దార్, జి.సిగడాం

ప్రతి రోజు యోగా..



యోగా కార్యక్రమంపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించాం. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు అధికారులతో కూడా యోగా చేయిస్తున్నాం. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది.

– గుంటముక్కల రామకృష్ణారావు, ఎంపీడీఓ, జి.సిగడాం

దినచర్యలో యోగా భాగం కావాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: దినచర్యలో యోగా భాగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఆర్.సురేష్‌కుమార్, ఆర్ఐఓ పి.దుర్గారావు అన్నారు. శుక్రవారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ నేతృత్వంలో యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఇంటర్‌విద్య జిల్లా యోగా కో-ఆర్డినేటర్ బి.శ్యామ్‌సుందర్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ పి.జగదీష్, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు జయలక్ష్మి, రాధ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలను పర్యవేక్షిస్తున్న ఆర్ఐఓ దుర్గారావు

యోగా డే విజయవంతం చేయాలి



ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని కళాశాలలో నిర్వహించే యోగాసనాల కార్యక్రమాన్ని విజయంతం చేయాలని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం వలంటీర్లతో కలిసి యోగాసనాలు వేశారు. అంతకుముందు విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర వేడుకల ప్రపంచ రికార్డులో భాగస్వాములయ్యే కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లను సైతం కళాశాల నుంచి పంపించినట్టు శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఆర్.శ్రీనివాస్ పాత్రో, పీవీ రమణ, సీహెచ్ రామమూర్తి, ఆర్.రవిశంకర్, సీహెచ్ చలమయ్య, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి కూటమి మోసాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అన్యాయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం వి.ఎస్.పురం పంచాయతీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల శ్రేయస్సుకే పని చేస్తానని చెప్పడం హర్షణీయమన్నారు. రానున్న ఏ ఎన్నికలైన దీటుగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మింది జనార్దన్ రెడ్డి, నాయకులు లంక సీతంనాయుడు, దుంప అక్కులు, బాసీ రమణ, రెడ్డి అప్పలనాయుడు, రెడ్డి వాసుదేవరావు, జగ్గురోతు సిమ్మినాయుడు, మింది సూరిరెడ్డి, లక్ష్మణరెడ్డి, గోవింద, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బ్రిటిష్ కాలం నుంచి ప్రారంభమైన రెవెన్యూ శాఖ అనేక మార్పులకు పునాదిరాయిగా నిలిచిందని, నాటి నుంచి నేటి భూ రక్షణ బాధ్యతలు రెవెన్యూ శాఖనే నిర్వహిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో శుక్రవారం రెవెన్యూశాఖలో సేవలందించిన విశేష సేవా రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచరాన శ్రీరాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బెవర పద్మావతి, అసోసియేషన్ ప్రతినిధులు ప్రవల్లిక, బి.వి.వి.ఎస్.రాజు, చంద్రశేఖర్, లింగరాజు, ధర్మాన ప్రకాష్, ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

➺ శ్రీకాకుళం రెవెన్యూ గెస్టు హౌస్‌లో జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడు కె.శ్రీరాములు ఆధ్వర్యంలో రెవెన్యూ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యదర్శి డి.చంద్రశేఖర్, పూర్వపు అధ్యక్షుడు ఎం.వి.సూర్యనారాయణ, ఎం.కాశీప్రసాద్, ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం అధ్యక్షురాలు కె.ప్రవల్లిక ప్రియ, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, సోని కిరణ్, జి.కె.శ్రీనివాసరావు, ప్రకాశరావు, వీఆర్‌వోల సంఘం నాయకులు వీఆర్ఎల్ శాస్త్రి, రామ్‌జీ, ఢిల్లేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం ప్రతినిధులు జి.వెంకటప్పారావు, అప్పలనాయుడు, రామారావు, త్రినాథరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

➺ **జి.సిగడాం:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ డే ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఎం.సరిత కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీటీ ఎస్.నిర్మల, ఆర్ఎస్‌డీటీ గాయత్రి, ఆర్ఐ ఆబోతుల రాధ, భూపతి నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి హరికథా నవరత్నాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న సుమిత్రా కళా సమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జూలై 6 నుంచి 14వ తేదీ వరకు హరికథా రత్నాలు పేరిట హరికథలు ఏర్పాటు చేస్తున్నట్లు సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఈ మేరకు నగరంలోని వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ముఖ్య సభ్యుడు, హరికథలపై డాక్టరేట్ పొందిన డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు సంస్మరణార్థం తొమ్మిది రోజుల పాటు తొమ్మిది మంది హరికథా భాగవతార్‌లతో బాపూజీ కళామందిర్‌లో ప్రదర్శనలు జరుగుతాయని వివరించారు. 6న సుందరకాండ, 7న తులసీ జలంధర, 8న సీతా కల్యాణం, 9న భూకైలాస్, 10న మార్కండేయ చరిత్ర, 11న పార్వతీ కల్యాణం, 12న ప్రమీలార్జునీయం, 13న శివ పర్యటన, 14న శ్రీకృష్ణ రాయబారం హరికథలు జరుగుతాయని, అభిమానులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కొంక్యాన మురళీధర్, వి.వి.ఆర్.మూర్తి, ఎం.రాజు, ఎం.వరలక్ష్మి, పూజ, ఉషారాణి, రాజు, వెంకట్, జ్యోతి, కె.అశోక్ పాల్గొన్నారు.

పాడిరైతులకు పశువుల దాణా పంపిణీ



పశువుల దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: వప్పంగి గ్రామంలో పాడి రైతులకు ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణ, అరసవల్లి వెటర్నరీ డాక్టర్ జి.దిలీప్, వి.వి.ఎస్.మూర్తి, సాహు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ


ఎచ్చెర్ల: లావేరు మండలం తామాడ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి యోగా గురువు భారత్

అరసవల్లి : యోగా అనేది భారత దేశ బ్రాండ్ అని.. ప్రపంచానికి మనదేశమే యోగా గురువు అని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని సందర్శించి అనివెట్టి మండపంలో యోగాసనాలు వేశారు. ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కూడా కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

బుడుమూరు వీర్రాజు.. కేరాఫ్ హార్మోనియం

- తయారీతో పాటు ప్రదర్శనలోనూ మేటి
- నాటకాల్లోనూ రాణిస్తున్న రణస్థలం కళాకారుడు



పౌరాణిక నాటక వేషధారణలో..



తాను తయారు చేసిన హార్మోనియం వాయిస్తున్న వీర్రాజు

రణస్థలం: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో హార్మోనియం తయారు చేయాలన్నా.. మరమ్మతులు చేయాలన్నా అందరికీ గుర్తొచ్చే పేరు బుడుమూరు వీర్రాజు. రణస్థలంకు చెందిన ఈయన హార్మోనియం తయారీదారుడిగానే కాకుండా రంగస్థలం కళాకారుడిగా అందరికీ సుపరిచితుడు. చిన్ననాటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ పౌరాణిక పద్యాలు వింటూ సంగీతంపై మక్కువ పెంచుకున్నారు. పలువురు సీనియర్ల సూచనల మేరకు నాటక రంగంవైపు అడుగులు వేశారు. పద్యాలు నేర్చుకుని నాటకాలు వేస్తూ మరోవైపు వడ్రంగి పని చేసేవారు. ఈ క్రమంలో హార్మోనియం వాయించడంలో శిక్షణ పొందడంతో పాటు తయారీ రంగంలోనూ మెలకువలు నేర్చుకున్నారు. కాలక్రమేనా హార్మోనియం తయారీలో అందేవేసిన చేయిలా నలుదిశలా ఖ్యాతి గడించారు. ప్రస్తుతం రణస్థలం మండలంలోని వెంకటరావుపేటలో ఉంటూ హార్మోనియాలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సమయం దొరికినప్పుడల్లా కళా రంగంలో ప్రదర్శనలు ఇస్తూ ప్రశంశలు అందుకుంటున్నారు.

తయారీలో ఘనాపాటి..

నాణ్యమైన, మన్నిక ఎక్కువ రోజులు ఉండేలా హార్మోనియం తయారు చేయడంలో వీర్రాజుకు సాటిలేరు. నాణ్యమైన హార్మోనియం తయారు చేయాలంటే కనీసం రెండు నెలలు సమయం పడుతుంది. ఒక్కొక్క హార్మోనియం తయారికి రూ.80వేలు వరకు ఖర్చు అవుతుంది. టేకు, గుమ్మిడి, ఇరిడి, దేవదారు చెక్క, గుగ్గిలం కర్ర, అట్టలు, లెదర్, జర్మన్ సిల్వర్ తీగ, చిన్న సైజు స్క్రూలు వినియోగిస్తారు. అదే గ్రామాల్లోని భజనలు, ఇతర కార్యక్రమాల కోసమైతే రూ.15 వేలు నుంచి రూ.30 వేలు మధ్య ధరలో హార్మోనియం తయారు చేసి అమ్ముతుంటారు. హైదరాబాద్, విజయవాడ, తెనాలి, గుంటూరు, రాజమండ్రి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి హార్మోనియం ఆర్డర్లు, మరమ్మతుల కోసం ఇతని వద్దకే వస్తుంటారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే హార్మోనియం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్వయం ఉపాధి కేంద్రంగా ఆసక్తి కలిగిన యువతకు శిక్షణ ఇస్తానని వీర్రాజు చెబుతున్నారు.

500లకు పైగా ప్రదర్శనలు



హరిశ్చంద్ర వేషధారణలో వీర్రాజు

హార్మోనియం తయారీతో పాటు నాటక రంగంలోని మంచి ప్రదర్శనలు ఇస్తుంటారు వీర్రాజు. సత్య హరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్ర పాత్ర పోషించిన వీర్రాజు ఇప్పటి వరకు 500కు పైగా పౌరాణిక నాటక ప్రదర్శనలు ఇచ్చారు. తండ్రి బుడుమూరు సత్యనారాయణ వడ్రంగి పని చేస్తుండేవారు. తల్లి పార్వతి గృహిణి.

విజేతలకు అభినందనలు



జి.సిగడాం మోడల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, సాలూరు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. - జి.సిగడాం

రక్తదానమే ప్రాణదానం



అత్యవసర సమయంలో చేసిన రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇడదాసుల సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట సత్యనారాయణ అన్నారు. రణస్థలంలోని సూర్య ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 16మంది యువకులు రక్తదానం చేశారు. రక్తం యూనిట్లను న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు తిరుపతిరాజు, వైద్యులు యశ్వంత్, సభ్యులు సురేష్ పాల్గొన్నారు. - రణస్థలం

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రీజనల్ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పడి 70 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఫౌండర్ తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు శుక్రవారం మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నేతృత్వంలో శ్రీకాకుళం ఎస్‌బీఐ రీజియన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 యూనిట్ల రక్తం సేకరించారు.

యూనియన్ జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్ పిలుపుమేరకు జరిగిన ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ సింగ్, స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ కిషోర్, స్టేట్ బ్యాంక్ స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ కెసీహెచ్ వెంకటరమణ, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ జగన్మోహన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య కుమార్, కె.సత్యనారాయణ, జి.రమణ అన్ని బ్రాంచీలు లోకల్ సెక్రటరీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో 'యోగా డే' పాట్లు

- ప్రభుత్వ బడుల్లో ఉదయం 6.30 గంటలకే మొదలుపెట్టాలని మార్గదర్శకాలు జారీ
- సుదూర ప్రాంతాలనుంచి టీచర్లు, పిల్లలు చేరడం సాధ్యమేనా ?



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యా సంస్థల్లో యోగాసనాలకు రంగం సిద్ధమైంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలలో యోగా డే వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం శనివారం 6 గంటలకే విద్యార్థులు బడులకు చేరేలా టీచర్లు చూడాలని స్పష్టంచేసింది. ఉదయం 6 గంటలకే హాజరు నమోదుచేయాలని, 6.30 నుంచి 8 గంటల వరకు యోగా నిర్వహించాలని, 8 నుంచి 9 వరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో అల్పాహారం అందించాలని అధికారులు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తరగతుల నిర్వహణ, స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిపి, అనంతరం 12 నుంచి 12.30 మధ్య డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అందించాలని, 12.30కు విద్యార్థులను ఇళ్లకు విడిచిపెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య ఆదేశించారు.

జూనియర్ కాలేజీల్లో ఇలా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ ఆదేశించారు. కార్పెట్స్/టార్పాలిన్ కవర్లు, మైక్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యోగాంధ్ర యాప్‌లో యోగాసనాల ఫొటోలను ఉదయం 10 గంటల లోపు అప్‌లోడ్ చేయాలని, విద్యార్థుల హాజరును అందులో నమోదుచేయాలని ఇంటర్‌విద్య డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

మండిపడుతున్న టీచర్లు, తల్లిదండ్రులు..

యోగా డే సందర్భంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న 'అతి'పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఉదయం 6 గంటలకు అటు పిల్లలు, ఇటు ఉపాధ్యాయులు పాఠశాలలకు ఎలా చేరగలరని వారంతా ప్రశ్నిస్తున్నారు. యోగా కార్యక్రమం నిర్వహన మంచిదేగానీ.. దీని పేరిట ప్రభుత్వం, అధికారులు ఇంతలా వేధించడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పిల్లల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.



డీఈవో పంపిన సందేశం